# గెలుపెవరిది?



యద్దనపూడి సులోచనారాణి

"గుడ్ న్యూస్. మీరు తండ్రి కాబోతున్నారు!" తెల్లటి మల్లెపూవుల్లాంటి బట్టలతో ఉన్న లేడీ డాక్టర్ లక్ష్మి స్ప్రింగ్ తలుపు తెరుచుకుని వస్తూ అంది. అక్కడే వరండాలో కుర్చీలో కూర్చుని పరధ్యానంగా బయటకు చూస్తున్న శ్రీధర్ లక్ష్మి రాకతో లేచి నిలబడ్డాడు.

"మీరు తండ్రి కాబోతున్నారు!" అతను పరధ్యానంగా ఉన్నాడని కనిపెట్టిన లక్ష్మి నవ్వుతూ అంది.

క్షణంసేపు శ్రీధర్‌కు లక్ష్మి చెబుతున్నదేమిటో అర్థంగానట్లు చూశాడు. మరుక్షణంలోనే అతని కళ్లలో అపూర్వమైన కాంతి ఒకటి తళుక్కుమని మెరిసింది. పెదవులు మెల్లగా చిరునవ్వుతో విచ్చుకున్నాయి. "నిజంగా!" అన్నాడు నమ్మలేనట్లు.

టేబిల్ వైపు వెళ్లిపోతున్న లక్ష్మి తల అదోరకంగా పెట్టి, మొగం వాల్చి శ్రీధర్ వైపు చూసింది, ఆ చూపులో అబద్ధం చెప్పవలసిన కర్మ నాకేమిటి అన్న భావం స్పష్టంగా కన్పరుస్తూ. శేఖరం పెదవులు కదిల్చి ఏదో చెప్పబోయాడు. ఈలోగా వెనక స్ప్రింగ్ తలుపు తెరుచుకుంది. లోపలినుంచి విజయ నెమ్మదిగా బయటికి వస్తున్నది. తలుపు తెరుచుకుని వస్తున్న విజయ క్షణంసేపు ఆగిపోయి భర్త వైపు చూసింది. శ్రీధర్ గూడా చూశాడు. ఇద్దరి కళ్లు కలుసుకున్నాయి. విజయ కళ్లు ముందుగా క్రిందకు వాలిపోయినాయి.

టేబిల్ దగ్గర నుంచి ఇద్దరినీ గమనిస్తున్న లక్ష్మి, "ఫస్ట్ ప్రెగ్నెన్సీ కాబట్టి కొంచెం బలహీనంగా ఉంది. అదేం పరవాలేదు. కొద్దిగా చికిత్స చేసుకుంటే సర్దుకుంటుంది. టానిక్స్ వ్రాసి ఇస్తాను" అంది ప్రిస్క్రిప్షన్ వ్రాయటానికి కాగితం తీసుకుంటూ.

శ్రీధర్ ఒకటికి రెండుసార్లు డాక్టర్‌కు కృతజ్ఞత చెప్పి బయటికి వచ్చాడు. పది నిమిషాల్లో ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు.

దారి పొడుగునా విజయ మౌనంగా ఉండటం చూసి "అలా ఉన్నావేం?" అని అడిగాడు శ్రీధర్.

"ఎలా ఉన్నాను?"

"ఎలాగో ఉన్నావు. నిన్ను ఇంత నిశ్శబ్దంగా ఇంతవరకూ ఎప్పుడూ చూడలేదు."

శ్రీధర్ మాటలకు విజయ నవ్వి ఊరుకుంది.

ఆ రాత్రి పడుకోబోతుండగా శ్రీధర్ విజయను దగ్గరకు తీసుకుంటూ "తల్లిని కాబోతున్నాననే సంతోషం నీకెలా ఉందో తెలియదు గాని, నాకుమటుకు తండ్రిని కాబోతున్నానని మహా గర్వంగా ఉంది" అన్నాడు.

'అలాగేం?'—అన్నట్లు చూసింది విజయ.

"నిజం. ఇదుగో అమ్మాయ్! ఇప్పుడే చెబుతున్నాను. ఇహమంచి తమకు కొన్ని ఆజ్ఞలు

జారీ చేయబడుతాయి. అవి ఏమాత్రం జవదాటి వట్ను కప్పించివా" అంటూ చూపుడువేలితో తన గుండెలమీద పెట్టి చూపించుకుంటూ, "ఇహ వీడు నీకు కంటికిగూడా కనపడడు. తెలిసిందా?" అన్నాడు.

"అదుగో! అప్పుడే మొదలైందా? పిల్లలు పుట్టకముందే బెదిరించేస్తున్నారు. ఆ తర్వాత ఇహ నా మొహమే చూడరులా ఉంది." పెదవులు ముడిచేసుకుని బుంగమూతి పెట్టేసింది, విజయ.

"అబ్బెబ్బే! అదెలా? నీకు పాపాయిలు పుట్టినా, నాకెప్పుడూ మొదటి పాపాయి నువ్వే. నీ తర్వాతే పుట్టబోయేవాళ్ళ!" మరింత దగ్గరగా లాక్కుంటూ అన్నాడు.

ఆ రాత్రి అలవాటుకు విరుద్ధంగా ఎప్పుడూ మితభాషిగా ఉండే శ్రీధర్ చాలా చాలా మాట్లాడాడు. ఏది కావలసినా తనను నిర్మొగ మాటంగా అడగమన్నాడు. ఎంతయినా తను మగవాడు కాబట్టి, ఇంట్లో మరో ఆడదిక్కు లేదు గాబట్టి, చాలా అవసరం అని అర్జెంట్ అని ఆ రాత్రే కూర్చుని పెత్తల్లి పేరిట రాజ మండ్రి ఉత్తరం వ్రాశాడు.

మర్నాడు ఇంటినిండా అందంగా బొద్దుగా ఉన్న చిన్న చిన్న పిల్లల కాలెండర్లు తీసుకు వచ్చి తగిలించాడు. అన్నింటిలోకి శ్రీధర్‌కు నచ్చింది చేతిలో యాపిల్‌పండుతో, చంకలో పిల్లి బొమ్మతో గిరజాల జుట్టుతో ఉన్న ఐదారు సంవత్సరాల ఆడపిల్ల. ఆ కాలెండర్ తీసుకువచ్చి విజయ పడుకునే మంచానికి ఎదురుగుండా తగిలించాడు. విజయ కది నచ్చలేదు. ఇంకో కాలెండర్‌లో ఆడుకునే సామానంతా ప్రక్కన పారేసి క్రింద కూర్చుని చేయి చాచి చిన్న బిస్కెట్‌ముక్కను కుక్కపిల్ల నోట్లో పెడుతూ, ఆ పెట్టడంలో యథాలాపంగా తను గూడ సగం నోరు తెరిచి గుండ్రటి మొహంతో బొద్దుగా ఉన్న బాబు కాలెండర్ నచ్చింది. విజయ అది కావాలంది.

"అబ్బే! అది వద్దు. అది చూస్తే మగపిల్ల వాడు పుడతాడు. నాకు ఆడపిల్ల కావాలి." శ్రీధర్ తగాదా పెట్టుకున్నాడు.

"ఆడపిల్ల నాకక్కర్లేదు. నాకు అదుగో! అచ్చం అలాటి బాబే కావాలి."

విజయ మొండిగా జవాబు చెప్పింది. ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. ఇంకో సమయంలో అయితే శ్రీధర్ చచ్చినా పట్టువదిలేవాడు కాదు. కాని ఈ సమయం వేరు. విజయ మనసు నొప్పించగూడదు. రాజీకి వచ్చి రెండు కాలెండర్లూ ప్రక్క ప్రక్కన తగిలించాడు.

"నేను ఒక్క బాబు వంకే చూస్తాను." చిలిపిగా అంది విజయ.

"అదుగో!" శ్రీధర్‌కు ఈసారి నిజంగానే కోపం వచ్చింది.

"పరేలెండి. ఏదో సామెత చెప్పినట్లుగా, పుట్టబోయే పిల్లలకోసం పెట్టబోయే పేరుని

**ఒక తరం తరువాత మరొక తరం వస్తూనే ఉంటుంది. ఈ విధంగా ఎప్పటి కప్పుడు పాతస్థానం కొత్త ఆక్రమించే ఏర్పాటు కమక లేకపోతే ప్రపంచంలో ప్రగతి సాధ్యమే ఉండేదికాదని ఒకరు అన్నారు. బాధాకరమైనదే అయినా దానిలో ఆనందమూ ఉన్నది.**

గురించి తగాదా పడ్డట్లు — రెండింటినీ చూస్తాను. సరేనా?" నవ్వుతూ అంది విజయ.

"అలా దారికి రా, బుద్ధిమంతురాలిలాగా." శ్రీధర్ మొహం మళ్లీ ప్రసన్నమైంది.

వారం రోజులకు శ్రీధర్ పంపిన రైలు ఖర్చులు అందీ అందగానే తిరుగు రైల్లో వచ్చి ఊడిపడింది పెత్తల్లి. ఆవిడది మహాకాయం. కూర్చున్న చోటునుంచి లేవలేదు. కాని కంఠం మటుకు కంచు కంఠం. కూర్చున్న చోటు నుంచి ఏ వైపయినా సరే మూడు మైళ్ళ వినిపిస్తుంది. అందుకని ఆవిడకు లేవలేనే అనే బాధ లేదు.

ఆవిడ గుమ్మంలో కాలు పెడుతూనే "ఏమే పిల్లా! తల్లివి కాబోతున్నావనే సంతోషమా ఏమిటి? చిక్కి సగం అయావు. తిండీ తిప్పలూ పూర్తిగా మానేశావా?" అంది.

విజయ తల వంచుకుని నవ్వేసింది. శ్రీధర్ పరీక్షగా విజయ వైపు చూశాడు. అవును. మొగంలో ఏదో మెరుపు వచ్చినట్లుంది గాని పరీక్షగా చూస్తే విజయ చిక్కినట్లే ఉంది. అది తన కంటికి అందనే లేదు. అందుకే ఇలాటి విషయాల్లో ఆడవాళ్ల ఆసరా కావాలంటారు అనుకున్నాడు.

పెత్తల్లి రాకతో ఇంటికి కొత్త సందడి వచ్చింది. ఆవిడ లేచింది మొదలు పడుకోబోయే దాకా దేనికో దానికి గొంతు పెట్టుకుని అరుస్తూ ఉంటుంది. విజయ కది చికాకనిపించినా భరించక తప్పటంలేదు. అరు నూరయినా, అటు సూర్యుడు ఇటు పొడిచినా విజయ పురుడు పెడితేగాని శ్రీధర్ ఆవిడను పంపడు. అదిమటుకు



'అయ్యగారికి దండంబెట్టూ'
చిత్రం—పి. పెంచలయ్య (చిత్తూరు)

ఖాయం. అంతకంటె చికాకైన విషయం రోజుకో రకంగా గుట్టలు గుట్టలుగా ఆవిడ చేస్తున్న పిండివంటలు. అవన్నీ తినలేక విజయ తల్ప్రాణం తోకకు వస్తున్నది. "నేను తినలేను బాబో!" అంటె ఆమె వెళ్లి శ్రీధర్‌కు చెబుతుంది. అది అతనికి కోపం తెప్పిస్తుంది.

"లావు అవుతానని భయంగదూ?" కళ్లతో చిరుకోపం కనపరుస్తూ అంటాడు అతడు.

"బాగుంది. అయేవాళ్ళు ఎలాగూ అవుతారు. ప్రత్యేకించి అవి తినక్కర్లేదు. సయించదు మొర్రో అంటె మీరుగూడా వినరేం?" కళ్ళలో నీళ్ళు గిర్రున తిప్పుకుని అక్కడినుంచి లేచిపోతుంది విజయ.

"ఏమో, నాయనా! మధ్య నాకెందుకు. ఏదో లేవలేనిది కదా అని చేయటంగాని నాకు ఓపిక ఉండి ఏడ్చిందా?" పెత్తల్లి వెళ్ళిపోయేది. ఇలాటి చిన్నచిన్న సంఘటనలతో తల్లి కాబోతున్నాననే సంతోషం విజయలో త్వరలోనే చల్లారిపోయింది.

పిండివంటకంటె భయంకరమైనవి పై నుంచి పెద్దమ్మగారి జాతక కథలు బోలెడు. ఆవిడ పుట్టిన పదవ ఏట పెళ్ళయింది. పెళ్ళి అయిన పదోరోజునే భర్త మరణించాడు. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఆవిడ జీవితం అంతా వాళ్ళకూ, వీళ్ళకూ పురుళ్ళు పోయడంతోనే గడిచిపోయింది. అందుకని ఆవిడకు బోలెడు కథలు తెలుసు. అనిగాక విన్నవి ఇంకా చాలా ఉన్నాయి. అవన్నీ కలిసి రకరకాలుగా రోజుకో కథ విజయకు వర్ణించి చెబుతుండేది. ఆ చెప్పేవిగూడా తల్లీ, పిల్లా సుఖంగా ఉన్నవైతే బాగుండు. మనసుకు కాస్త ఆహ్లాదకరంగా అన్నా ఉండేవి. అహా! అలా కాదు. వాళ్ళ మేనత్త మనమరాలు నెలలునిండి నడవలేక ఎలా అవస్థపడేదో, వాళ్ళ పుట్టింట్లో ఇంటిప్రక్కనున్న మునసబు గారమ్మాయి ప్రసవించలేక ఏవిధంగా యాతనపడిందో, వాళ్ళకు తెలిసిన వాళ్ళలో సరిగ్గా విజయలాగే ఉండి అదే వయసులో నిండు నెలలు వచ్చింతర్వాత గుర్రం వాతంవచ్చి చచ్చిపోతే ఆపరేషన్‌చేసి కడుపుకోసి పిల్లను ఎలా బయటకు తీశారో— ఇలాంటివి బోలెడు. కాఫీ చేస్తూనో, భోజనం పెడుతూనో, మధ్యాహ్నం శ్రీధర్ ఆఫీసుకు వెళ్ళినపుడు ఊరికే కూర్చున్నప్పుడో ఆవిడ ఇలా వర్ణించి చెబుతూంటె విజయ కళ్ళు పెద్ద పెద్దవి చేసుకుని చెవులు దోరపెట్టుకుని ఒక్క అక్షరంగూడా పొల్లుపోకుండా వినేది. పాపం అలా చెప్పటంలో పెద్దమ్మగారికి వేరే ఉద్దేశ్యం ఏమీలేదు. అలా బాధలు పడటానికి వాళ్ళవాళ్ళ నిర్లక్ష్యాలే కారణాలని, అలాటి నిర్లక్ష్యాలు విజయను చేయ

వద్దని చెప్పేది. కాని కథ చివర ఉన్న నీతి వాక్యాల్లా ఈ ఆఖరి మాటలు, తీసుకోవలసిన జాగ్రత్తలు విజయకు వినిపించేవిగావు. ఆ కథల తోటే మతిపోయినంత పనయ్యేది.

ఆరోనెల రాగానే ఉదుకుష్టంగా ఉంటుందని శ్రీధర్ గదిలో విజయకు విశాలంగా వేరే ప్రక్క ఏర్పాటు చేశాడు. రాత్రి మంచంమీద పడుకోగానే ఉదయం పెద్దమ్మగారు చెప్పిన కథల్లోని మనుష్యులంతా వరసగా విజయను పలకరించటానికి వచ్చేవాళ్ళు. హడిలిపోయిన విజయ కలతనిద్రలో లేచి ఒంటరిగా పడుకోటానికి భయపడి శ్రీధర్ మంచంమీదకు వచ్చి మెల్లగా అతని ప్రక్కన చోటు చేసుకుని పడుకునేది. ఏరాత్రివేళో ఎందుకో మెలకువ వచ్చిన శ్రీధర్ లేచి చూస్తే ప్రక్కగా తనకెక్కడ మెలకువ వస్తుందోనన్నట్లు ఒదిగి పడుకున్న విజయను చూస్తే జాలివేసేది. నిద్రలో ఉన్న విజయకు మెలకువ రాకుండా సరిగా పడుకునేలా చేసి జాగ్రత్తగా కప్పి తనులేచి వచ్చి యువతల మంచం మీద పడుకునే వాడు.

నెలలు దగ్గర పడుతున్నకొద్దీ విజయకు తనకు తెలియకుండానే మనసులో ఏదో బెంగలాటిది పట్టుకుంది. ఎలా ఈ గండం దాటడం? ఎప్పుడు బయటపడడం తను? అసలుబయటపడుతుందా అని. ఆడదానికి ప్రసవించి మళ్ళీ మామూలుగా కావటం అనేది మరోజన్మేనంటారు. క్రమంగా విజయ ఆలోచనలు విపరీతమార్గాలు తొక్కటం మొదలుపెట్టాయి. తను ప్రసవించే రోజుకాదు,మృత్యుముఖంలోకి వెళ్ళేరోజు దగ్గరికి వస్తున్నదని అనిపించేది.

ఒకరోజు రాత్రి, శ్రీధర్, విజయ ఇద్దరూ భోజనంచేసి పైన వరండాలో కూర్చున్నారు. తెల్లటి వెన్నెల చక్కగా ఉంది. శ్రీధర్ కుర్చీలో జేరగిలబడి ఏదో ఆలోచిస్తున్నాడు. పెద్దమ్మగారు పడుకోవటం వల్ల ఇల్లు నిశ్శబ్దంగా నిద్రపోతున్నట్లుంది.

"ఏమండీ, ఒకవేళ ప్రసవించలేక నేను చచ్చిపోతే?" అంది నెమ్మదిగా విజయ.

"ఛ! ఛ! ఏమిటామాటలు? నువ్వు పుట్టలా? నేను పుట్టలేదూ? అందరూ ఇలా భయపడి హడిలిపోతే ప్రపంచం ఇలా పెరగ గలిగేదా?" శ్రీధర్ లేచివచ్చి విజయ ప్రక్క సోఫాలో కూర్చున్నాడు.

"ఏమో! నాకెలాగో అనిపిస్తున్నది. ఇంకా ఎన్నాళ్ళో ఈ బరువు?" విజయ శ్రీధర్ ఒళ్ళో తలదాచుకుంటూ అంది.

"అయిపోయిందిగా! ఒక్క వారంరోజుల్లో పురుడు వస్తుందని డాక్టర్ లక్ష్మి చెప్పలేదూ? భయపడకు. ఏమీగాదు. మనకు చక్కటిబాబు పుడతాడు. నీకు బాబే కావాలన్నావుగా? పేరేం పెడదాం చెప్పు? నేనదే ఆలోచిస్తున్నాను." ఆప్యాయంగా ఒళ్ళో ఉన్న విజయ జుట్టు సవరిస్తూ అన్నాడు.

"మొన్నటిదాకా పాప కావాలని పోట్లాడి ఇవాళ బాబు అంటున్నారే?" నీరసంగా నవ్వింది విజయ.

"ఎవరైనా సరే. నీవారక్తం కలిసిపోయి, మన మనసులు పెనవేసుకున్న రూపం. ఏదయితే నేం మన ప్రేమానురాగాలకి ప్రతిరూపం?" విజయ అలాగే కూర్చుండి పోయింది శ్రీధర్ మాటలు వింటూ.

డాక్టర్ లక్ష్మి చెప్పినదానికంటే నాలుగు రోజులు ముందుగానే పురుడు వచ్చేసింది. ఒక రోజు ఉదయం లేస్తూనే విజయ బద్ధకంగా ఉంది. ఆరోజల్లా ఎలాగో ఉంది. సాయంత్రం అయేసరికి మొహం వాడిపోయింది. ఆరాత్రి సరిగా నిద్రపట్టలేదు. మర్నాడుగూడా అలాగే ఉంది. శ్రీధర్ ఆఫీసుకు సెలవు పెట్టేశాడు. ఆరోజు సాయంత్రానికి ఆస్పత్రికి వెళ్ళవలసి వచ్చింది.

"అప్పుడేగాదు. ఇంకా అయిదారు గంటలు పైముంది" అంది విజయను పరీక్షచేసి బయటకు వచ్చిన డాక్టర్ లక్ష్మి.

"నేనుండవచ్చా అప్పటివరకు? ఫర్వాలేదా? అభ్యంతరం ఉండదుగదా?" అడగలేక అడిగాడు శ్రీధర్.

తలెత్తి ఒకసారి మొగంలోకి పరీక్షగా చూసిన లక్ష్మి ఏమనుకుందో ఏమో సరేనని తలఊపి వెళ్ళిపోయింది.

నొప్పులు ప్రారంభమైనాయి. విజయకు తెలియని బాధ ఏదో నరాలను గుంజేస్తున్నది. మధ్యమధ్య తనకు తెలియకుండానే "అబ్బా!", "అమ్మా!", "అయ్యో!" అనేస్తున్నది. ఉన్నట్లుండి కెవ్వుమని "బాబో! చచ్చిపోతున్నాను. డాక్టరును రమ్మనండి" అంటున్నది. కాని ఎవరూ వినిపించుకున్నట్లే లేదు. శ్రీధర్ మనసులో కంగారు పడినా బలవంతాన ధైర్యం తెచ్చుకుని కూర్చున్నాడు.

చూస్తుండగానే నాలుగు గంటలు గడిచి పోయినాయి. డాక్టరు లక్ష్మివచ్చి ఏదో ఇంజక్షన్ ఇచ్చి మరీ నర్సు సాయంతో విజయను లోపలి గదిలోకి తీసుకెళ్ళిపోయింది.

బయటవరండాలోఒంటరిగానిశ్శబ్దంగా నిలబడిపోయాడు శ్రీధర్. అతనికోసం వేసిన కుర్చీలో కూర్చోవాలని గూడా అనిపించడం లేదు అతనికి. బయట వెన్నెల పిండారబోసినట్లుంది. ప్రశాంతంగా ఉన్న వాతావరణంలో వరండా ముందున్న పూలమొక్కలు 'విజయ బాధను మేమూ గమనిస్తున్నాం' అన్నట్లు స్థాణువుల్లా నిల్చిఉన్నాయి. ఇలాటి బాధలతో మనుష్యులు యాతన పడతారని తెలియని పక్షులేవో గూటిలో చేరి కువకువమంటున్నాయి.


వరండాలో ఉన్న స్తంభాన్ని ఆనుకుని నిశ్చలంగా నిలబడిపోయి బైటకు చూస్తున్న శ్రీధర్‌కు లోపలనుంచి "నేనీబాధ భరించలేను డాక్టర్", "చచ్చిపోతున్నాను" అని బిగ్గరగా అంటూ మధ్య మధ్య ఏడుస్తున్న కేకలు వినిపిస్తున్నాయి.వాటిలో భావం ఏదో ఛురకత్తిలా శ్రీధర్ హృదయం లోంచి దూసుకుపోయింది. నలుగురుండగా గట్టిగా నవ్వడానికిగాని, మాట్లాడడానికిగాని సిగ్గుపడే విజయ—ఎలా అంటోందోబాధతో! స్పృహ లేనట్లుంది! తనేం చేయగలడు? కనీసం తను దగ్గరగా ఉంటేనైనా విజయకు ధైర్యంగా ఉంటుందేమో! ఏదో గుర్తు వచ్చినవానిలా శ్రీధర్ విజయను పడుకోబెట్టిన గదివైపు రెండడుగులు వేశాడు. ఇంతలో గ్లోవ్స్ తొడుక్కున్న లక్ష్మి ఏదో పనిమీద గబగబా బయటకు వచ్చింది.


"డాక్టర్! నేను లోపలకు రాగూడదూ? జయకు కొంత ధైర్యం వస్తుందేమో!" గబగబా వెడుతున్న లక్ష్మి, శ్రీధర్ మాటలతో చటుక్కున ఆగిపోయి వెనక్కు తిరిగి చూసింది. అదో రకంగా నవ్వి "ఎవరుండి ఎవరేం చేయగలరు? అసలు మీరు ఇంటికి వెళ్ళిపోవటం మంచిది. ఇక్కడుంటే అలాగే అనిపిస్తుంది" అని మళ్ళీ చకచకా వెళ్ళిపోయింది.



'వితతనంబు
మఱ్ఱి వృక్షంబునకు నెంత?'
ఫోటో—డి. రవిప్రసాద్ (విజయవాడ-2)

నిర్వీణ్ణుడైన శ్రీధర్ మళ్ళీ స్తంభం దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. ప్రపంచం ప్రశాంతత ఒడిలో హాయిగా నిద్రపోతున్నది. ఎవరికీ ఏ బాధా లేదు. తనకూ లేదు. కాని విజయ? భగవాన్? ఎంతో మధురమైన ఆ సమయాన్ని స్త్రీ పురుషు లిద్దరూ సమానంగా అనుభవిస్తారే! కాని ఈ బాధ స్త్రీ ఒక్కదానికే ఎందుకిచ్చావు? ఇందులో పురుషుడికి కూడా భాగం ఎందుకు పెట్టలేదు? ఏం పాపం చేశారని వాళ్ళకీ శిక్ష? ఎంతో అందమైన అనుభూతి పొందిన ఆ సమయాలను ఓ విధంగా విజయకంటే తనే ఆనందించి అనుభవించాడేమో! ఆ అనుభవంలో విజయకు ఇలాటి బాధ లభిస్తుందని తనకేం తెలుసు? అసలు ప్రసవవేదన ఇంత భయంకరం అనుకుంటే తను పిల్లలనే కోరుకునేవాడు గాదు. ఈ సమయంలో విజయకు తనేం చేయలేకపోతున్నా డెందువల్ల? అసలు సృష్టి రహస్యం ఇందులోనే ఉందా? కనీసం తను విజయ




# గెలుపెవరిది?

ప్రక్కనైనా నిలబడితే తనకు మనశ్శాంతిగా ఉండేది. కాని డాక్టర్ లక్ష్మి వద్దంటున్నది. పైగా గట్టిగా మాట్లాడితే ఇంటికి వెళ్లి పొమ్మని బయటకు గెంటుతుంది కూడ. తన బాధ ఆవిడకేం తెలుస్తుంది? శ్రీధర్‌కు లక్ష్మి మీద విరుచుకు తినాలన్నంత కోపం వచ్చింది. కాని ఏంచెయ్యలేక నిస్సహాయంగా నిమిషాలు లెక్క పెట్టుకుంటూ, అక్కడే నిలబడిపోయాడు. లోపల శిశువేమైనా సరే! విజయ సవ్యంగా బ్రతికి బయటపడితే అదే చాలు. భగవంతునికి లోపల్లోపల మనసారా మొక్కుకున్నాడు. తనకు తెలియకుండానే తను జీవితంలో మొదటిసారిగా భగవంతుడిని మనసారా తలవటం గుర్తువచ్చే సరికి నవ్వు వచ్చింది. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ విజయ స్వరం ఖంగుమంటున్నది.

"నా ప్రాణం పోకపోతే పోవటానికి ఏదయినా మందివ్వు డాక్టర్. నేనీ బాధ భరించలేను."

"హాఁ! ఏమిటా అరుపులు. అందరూ నిద్ర లేచి పరుగెత్తుకొచ్చేరు!" నెమ్మదిగా కసురుతున్నది లక్ష్మి.

"నా ప్రాణం పోతోంది అంటే వినరేం?" కోపంగా బాధతో పళ్లు బిగబట్టి అంది విజయ.

"ఎక్కడికి పోతుంది? నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. సరేనా? నువ్వు నరాలు బిగ బట్టకు. మరింత బాధపడతావు."

"ఇప్పుడసలు పడనట్లు!" విజయ శరీరం బాధతో మెలికలు తిరుగుతున్నది.

మనసు కసితో కరకరమంటున్నది. తనకు తెలుసు, ఈ బాధలు భరించలేదని. కాని శ్రీధర్ తనను మోసం చేశాడు. తను చచ్చిపోతానని తెలిసే కావాలనే 'ఎంకరేజి' చేశాడు. తను ఏమైపోతేనేం? అతనికి కావలసినది పిల్లలు. తండ్రి వయానే గర్వం. అది దొరికితే చాలు. ఛీ! మగవాడి కెంత స్వార్థం. అంత స్వార్థం మనసులో పెట్టుకుని పైపైన తీపి తీపి మాటలు. తనింత యమయాతనకు గురి అయేటప్పుడు ఆ వెధవ పిల్లలు లేకపోతేనేం? అలా కాదు. ఆడదన్న తర్వాత చచ్చినట్లు పిల్లలను కనితీరవలసిందే! పెద్దమ్మగారు చెప్పినట్లు తను సవ్యంగా ప్రసవించలేకపోతే? ఒక వేళ వాతం కమ్ముకువస్తే? వస్తే ఏమవుతుంది? ప్రాణం పోతుంది. శ్రీధర్ వాళ్ళు ఒక్క ఏడుపు ఏడ్చి ఊరుకుంటారు. మర్నాటికి కట్టెలమధ్య నగ్నంగా శవాన్ని నొక్కిపట్టి కాల్చి బూడిద చేస్తారు. అదీ జీవితం అంటే. ఇదంతా శ్రీధర్‌కు తెలుసు. కాని తనకు చెప్ప లేదు. ఎన్నో విషయాలు తెలిసిన అతనికి ఇది మటుకు ఎందుకు తెలియదు? ఒక్కసారి పిలిచి 'నువ్వు చేసిన మోసం కనుక్కున్నాను' అని మొగంమీద చెప్పేస్తే? అవును చెప్పాలి. అదుగో తనకు మత్తులాటిది ఏదో వస్తున్నది.

ప్రాణం పోవటం అంటే అదేనేమో! కళ్ల ముందు వెలుగు మసకగా మారిపోతున్నది. చీకట్లు కమ్ముతున్నాయి...

ఒళ్లంతా చెమటలతో తడిసిపోయిన విజయ మూలగడానికి కూడా ఓపిక లేనట్లుగా అతి నీరసంగా "డాక్టర్! ఆయనేరీ? ఒక్కసారి పిలవండి. నాకేదో మత్తులాటిది వస్తోంది" అంది.

"భయపడకు. మత్తు వచ్చిందా? రానీ. మళ్లీ మెలకువ వస్తుందిలే. ఆయనిక్కడికి రాకూడదు." కాళ్ల దిగువున నిలబడిన లక్ష్మి అంది.

"ఎక్కడ మనిషి! డాక్టర్ గాదు. రాక్షసి! దెయ్యం! చెబితే వినదేం?"— విజయకు అంత నీరసంలోనూ ఒళ్లు మండింది.

"ఎందుకు రాకూడదు? నా విషయం తెలియదంటూ ఏముంది? పిలవండి. నేను చూడాలి. లేకపోతే నేనే పిలుస్తాను." లేవబోతున్న విజయను గబగబా ఇద్దరు వచ్చి బలవంతాన పడుకోబెట్టారు.

"నువ్వు బలే అసాధ్యురాలిలాగా ఉన్నావే? అంత ఆగలేకుండా ఉన్నావా? సిస్టర్! బయట నిలబడి ఉన్నారు. ఆయనను ఒక్క నిమిషం వచ్చి వెళ్లమను" అంది లక్ష్మి.

అవి ఎన్నో కేసులు చూసింది గాని — ఇలాటి సంఘటన జన్మలో చూడలేదు. శ్రీధర్ వచ్చేముందు తెల్లటి దుప్పటి ఒకటి కప్పి విజయ శరీరం అంతా శ్రీధర్‌కు కన్పించకుండా ఉండేలా జాగ్రత్త పడింది లక్ష్మి.

స్ప్రింగ్ తలుపు తెరుచుకుంది. విజయ తల తిప్పి చూసింది. వెనక వెంటనే మూసుకున్న తలుపుకు ఇవతలగా చెదిరిపోయిన జుట్టుతో అలసిపోయిన మొగంతో, ఎప్పుడూ ఎంతో గంభీరంగా ఉండే శ్రీధర్ జాలికొలిపే చూపుతో దీనంగా నిలబడి ఉన్నాడు. అతని మొగం పాలిపోయినట్లు స్పష్టంగా తెలుస్తున్నది.

"దగ్గరికి అలా తల వైపుగా రండి. ఆవిడ మీకేదో చెప్పాలిట!" విసురుగా అంది డాక్టర్ లక్ష్మి. నర్సు నిశ్శబ్దంగా తమ పని చూసుకుంటున్నది.

శ్రీధర్ మెల్లగా విజయ దగ్గరకు వచ్చాడు. "ఏమిటి, విజయా?" అతని కంఠం బొంగురుగా ఉంది. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఎన్నో ఆడగాలి; ఎంత ఘాటుగానో ఆడగాలి అన్న విజయ మనసు శ్రీధర్‌ను అలా చూడగానే జాలితో మెత్తబడిపోయింది. తను పడుతున్న ఈ బాధకు ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో ఉండి అతనెంత నరకం చూస్తున్నాడో అతనిని చూస్తుంటే తెలుస్తూనే ఉంది. కాపురానికి వచ్చిన ఇన్ని సంవత్సరాలలో అతని కళ్లలో నీళ్లు మొదటిసారిగా చూస్తున్న విజయకు మనసు కరిగిపోవటమేగాదు; అతనిని అంత అన్యాయంగా ఊహించుకున్నందుకు తనమీద తనకే కోపం వచ్చింది.

"ఏంకావాలి?" ఎక్కడో ఉన్నట్లు, ఈ లోకానికి సంబంధించనట్లున్న విజయ చూపులో చూపులు కలుపుతూ తన ఉనికిని గుర్తించమన్నట్లుగా అడిగాడు శ్రీధర్.

"ఏం లేదు. ఊరికే పిలిచాను. మీరువెళ్లండి." అప్పటికే నొప్పులు తెలియకుండా ఉండేందుకు డాక్టర్ ఇంజెక్షన్‌తో కళ్లు మూతలు పడుతున్న విజయ అస్పష్టంగా అంది.

"ఏమిటో చెబుతానన్నావు?" అంది డాక్టర్ లక్ష్మి.

"అవును. కాని నాకేం తెలియడం లేదు. అలా మత్తుగా ఎలాగో ఉంది, డాక్టర్!" అస్పష్టంగా అంది విజయ. అప్పటికే కళ్ళు పూర్తిగా మూతలు పడినాయి.

"మీరు వెళ్ళండి" అంది లక్ష్మి స్థాణువులా నిలిచిపోయిన శ్రీధర్‌ను చూస్తూ. చేసేదిలేక భగవంతుడిమీద వదిలేసి బయటికి వచ్చాడు శ్రీధర్.

మరో పదిహేను నిమిషాల్లో "కేర్"మన్న ధ్వని విన్పించింది. విజయ కేకలు ఆగిపోయినాయి. పరధ్యానగా నిలబడ్డ శ్రీధర్ ఉలిక్కిపడ్డాడు. కంచుగంటలా నిశ్శబ్దంలోంచి పసిపిల్ల కంఠం ఖంగ్‌మంది. అనుకోకుండా శ్రీధర్ గుండె దడదడలాడింది. అంతసేపూ అలా నిలబడటం మానవజీవితాన్ని గురించి అనుకోకుండా వచ్చిన వేదాంతపుటాలోచనలు అన్నీ ఎగిరిపోయినాయి. గబగబా రెండడుగులు గదివేపు వేశాడు.

"ఆగవయ్యా! నీకోసం మీ అమ్మా, నాన్నా ఖంగారు పడిపోతున్నారు." లేడీడాక్టర్ లక్ష్మి మాటలు గదిమంచి దూసుకుని వచ్చి శ్రీధర్ చెవులను తాకాయి.

అయితే మగపిల్లాడన్నమాట. ఇంతలో నర్సు బయటికి వచ్చి "మగపిల్లవాడు!" అంది. శ్రీధర్ ఒక్కక్షణం నర్సు మొహంలోకి చూసి ఆగమని వెంటనే జేబులోకి చేయిపోనిచ్చి చేతికి వచ్చిన పదిరూపాయల కాగితాన్ని తీసి నర్సు చేతిలో పెట్టి "థాంక్స్" అన్నాడు. నిమిషంసేపు అనుకోని ఈ సంఘటనకు తెల్లబోయిన నర్సు వెంటనే తమాయించుకుని, శ్రీధర్ ఇచ్చిన నోటును మడిచి జాకెట్‌లోపల దాచేసుకుని, మళ్ళీ ఏమీ ఎరగని దానిలా నిర్వికారంగా లోపలికి వెళ్ళిపోయింది.


అప్పటికి గుర్తు వచ్చింది శ్రీధర్‌కు తను వచ్చినప్పటినుంచి నిలబడి ఉన్న సంగతి. వెళ్ళి తనకోసం వేసిన కుర్చీలో కూర్చున్నాడు. చకచకా పది నిమిషాలు గడిచిపోయినాయి.

"హమ్మయ్య! ఆవిడ ఖంగారు చూసి ఇంత తేలికగా తెములుతుందనుకోలేదు. మగపిల్లవాడు. మంచి ప్రెజెంటేషన్ ఇవ్వాలి మాకు." డాక్టర్ లక్ష్మి, శ్రీధర్ దగ్గరగా వచ్చి ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ అంది.

"తప్పకుండా. అంతా మీ చలవ" అన్నాడు శ్రీధర్ కృతజ్ఞతలు నిండిన చూపులతో లేచి నిలబడుతూ.

"నాదేం ఉందిలెండి? అయినా, ఆవిడకంటే మీకే ఖంగారెక్కువైపోయింది." నవ్వుతూ అంది లక్ష్మి. శ్రీధర్ మొహం సిగ్గుతో క్రిందికివాలింది.

"మొదట మీరు వస్తానంటే ఎందుకు వద్దన్నానో తెలుసా? ఒక్క డాక్టర్ల విషయం వదిలేస్తే మామూలుగా ప్రతి మగవాడికి స్త్రీ నుంచి తనకు లభ్యమైన వాటిల్లో ఓవిధమైన నూతనత్వం కన్పించాలి. భార్యను గురించి భర్తకెంత తెలిసినా, అసలెప్పటికీ తెలియనివి కొన్ని ఉంటాయి. వాటిని గురించి మగవాళ్ళకి అందమైన భ్రమ ఒకటుంటుంది. ప్రసవవేదన లాటి సమయంలో స్త్రీనిచూస్తే మగవాడికి ఆ భ్రమ పోతుంది. అందుకే మిమ్మల్ని వద్దన్నాను. మగవాడిని అన్నిచోట్లకి రావడానికి అనుమతి ఇచ్చే మనవాళ్ళు ఈ ఒక్క విషయంలో ఎందుకు ఇవ్వలేదో మీకిప్పుడర్థమైందనుకుంటాను."



ఈడూ - జోడూ

చిత్రం—ప్రేమచంద్రగోస్వామి (మైసూర్)

బయట వెన్నెలపోయి అప్పుడే కన్పించీ కన్పించనట్లు వస్తున్న తొలివెలుగు వంక చూస్తూ అంది లక్ష్మి. లక్ష్మి మాటలు చాలా శ్రద్ధగా విన్నాడు శ్రీధర్.

"రండి. బాబుని చూద్దురుగాని!" శ్రీధర్‌ని వెంట బెట్టుకుని లోపలకు వెళ్ళింది లక్ష్మి.

అప్పటికే బాబుకు స్నానం చేయించి ఉయ్యాలలో పడుకోబెట్టింది నర్సు.

విజయకు అప్పుడప్పుడే మెలకువ వస్తున్నది.

"వెళ్ళి ప్రక్కన అదుగో ఆ స్టూలు లాక్కుని కూర్చోండి" అంటూ లక్ష్మి ఆదేశించిన ప్రకారం స్టూలు ఒకటి లాక్కుని విజయ మంచం దగ్గరగా కూర్చున్నాడు. కాళ్ళనుంచి కంఠం వరకూ తెల్లటి దుప్పటితో కప్పబడి ముఖం మీట్టుకు ప్రక్కగా వంచి నిద్రపోతున్న దాళిలా సొమ్మసిల్లి

నట్లు పడుకుని ఉంది విజయ. డాక్టర్ లక్ష్మి సిరెంజి తెచ్చి మరొక ఇంజెక్షన్ ఇచ్చింది. అప్పటికే తెలివి వచ్చినట్లున్న విజయ కళ్ళు తెరిచి మళ్ళీమూసుకుంది.

శ్రీధర్ అలా కూర్చుని ఉండగానే మరో పదిహేను నిమిషాలు గడిచి పోయినాయి. మళ్ళీ ఒక గంటలో వస్తానని నర్సును ఉండమనిచెప్పి డాక్టర్ వెళ్ళిపోయింది. ఆవిడ వెళ్ళిన కొద్ది సేపటికి విజయకు బాగా మెలకువ వచ్చింది. కళ్ళువిప్పి చూసింది. ఎదురుగుండా శ్రీధర్ బంగారు నిండిన కళ్ళతో మీదకువంగి "విజ్జీ, మెలకువ వచ్చిందా? ' అన్నాడు.

"ఊ!" అంది.

# గెలుపెవరిది?

"హమ్మయ్య. బ్రతికే ఉన్నాను కదా! కలా, నిజమా?" తన చేతిని తీసుకున్న భర్త చేతుల స్పర్శకోసం తడుముతూ అంది.

"ఇలా చూడు, సరిగా నావైపు." శ్రీధర్ విజయచేతిని బుగ్గకు ఆనించుకుంటూ అన్నాడు.

విజయకు పూర్తిగా మెలకువ వచ్చేసింది.

"చాలా కష్టపడ్డావు సుమా! ఇదంతా నామూలానే కదూ?" వంగి నుదురుమీద పడిన ముంగురులను సరిచేస్తూ అన్నాడు. అతని కంఠంలో ఆప్యాయతనిండుగా తొణికిసలాడు తున్నది.

"బాబా? పాపా?" నీరసంగా అడిగింది విజయ.

"బాబే! నర్స్" అని కేకవేశాడు శ్రీధర్. బయట కుర్చీలో కునికిపాట్లు పడుతూన్న నర్సు లేచి వచ్చింది.

"పిల్లాడిని చూపించు" అన్నాడు శ్రీధర్. అతనికంఠం మామూలుగా మారిపోయింది.

నర్సు జాగ్రత్తగా తెల్లటి బట్టలో చిన్న నోరుతో కళ్ళు మూసుకుని గుప్పెట్లు బిగబట్టి 'నేనీలోకంలోకి ఇప్పుడే వచ్చాను. బాగా అలిసి పోయాను. కొంచెం నిద్రపోనివ్వండి' అన్నట్లు నిద్రపోతున్నట్లున్న పిల్లాడిని తెచ్చి శ్రీధర్‌కు ఇచ్చింది. శ్రీధర్ రెండు చేతుల మధ్య అపురూపంగా పట్టుకున్న పిల్లాడిని విజయ వింతగా భయంగా చూసింది.

"అంతా నీపోలికే. ఆముక్కు చూడు. గడ్డం మీద ఆ చిన్న సొట్ట ఎంత స్పష్టంగా తెలుస్తోందో?" సగర్వంగా, తృప్తిగా పిల్లాడిని చూపిస్తూ అన్నాడు శ్రీధర్.

విజయ నీరసంగా నవ్వి ఊరుకుంది. నర్సు పిల్లాడ్ని తీసుకెళ్ళి ఉయ్యాలలో పడుకోబెట్టి బయటకు వెళ్ళిపోయింది.

"మొత్తానికి నువ్వే గెల్చావు. నామాట వినలేదు కదూ?" నిష్ఠూరంగా అన్నాడు శ్రీధర్.

అలిసిపోయిన విజయ కళ్ళు మత్తుగా మెరిశాయి. చేయిచాచి భర్త చేతిని అందుకోటానికి ప్రయత్నిస్తూ "ఈసారిమీరు గెలుద్దురుగాని" అంది.

"అమ్మో! ఇంకానా? వద్దు వద్దు. నాకింకే పిల్లలూ అక్కర్లేదు. ఇప్పటికి నువ్వు పడిన ఈ యాతన చాలు." అయిష్టంగా తలఊపాడు శ్రీధర్.

తెలిసో తెలియకో, విజయను బాధకు గురి చేశాడు. ఈసారి మళ్ళా కలలోగూడ అలాటిది జరగనివ్వడు. తనకు అంతగా ఆడపిల్లమీద మోజు ఏర్పడితే ఎవర్నయినా పెంచుకోవచ్చు.

"బాధేం ఉంది? ఆడపిల్ల మీకక్కర్లేక పోతే నాకు కావాలి."

"విజ్జీ!"

"అవును. నాకు తెలియక ఏవేవో ఊహించుకుని భయపడి పోయాను. మీచేతుల్లో బాబుని చూస్తుంటే నాకదంతా గాడే అనిపించడంలేదు. అయినా ఆమాత్రం కష్టపడకపోతే ఎలా?" విజయ మాటకు శ్రీధర్‌కు [illegible] వచ్చింది.

"సర్లే! నువ్వు కళ్ళుమూసుకు పడుకో. రాత్రంతా నిద్రలేదు. బాగా రెస్టు తీసుకో." విజయ తలమీద చేయివేసి నిమురుతూ అన్నాడు శ్రీధర్.

కిటికీలోంచి లోపలికొస్తున్న వెలుగువంక చూస్తూ కళ్ళుమూసుకుంది విజయ. శ్రీధర్‌కు మనసులోంచి కొండంత బరువును ఎవరో దించేసినట్లు అనిపించింది. ★


తలనొప్పి
పోగొట్టుకోండి ఇదుగో
అమృతాంజనము

అమృతాంజన్‌లో 10 రకాల శమనం కల్గించే ఔషధాలు చేరడంచేత ఇది శీఘ్రంగా అమోఘంగా నివారణను కలిగిస్తుంది. ప్రతీ సారి పిసరంత చాలు కాబట్టి ఒకే సీసా నెలల తరబడి వస్తుంది. 70 ఏళ్ళ ప్రశస్తిని గన్న ఇంటి మందు. అమృతాంజన్ కండల నొప్పి, బెణుకు, గుండె జలుబు ఇంకా ఇతర నొప్పులు, జలుబులు మరియు ఇతర బాధలకు అమోఘమైనది.

వాతావరణం మార్పు సంసారంలో తాపత్రయాలు, నొప్పులు, జలుబులు మరియు బాధలు కలిగిస్తాయి. ఎప్పుడూ అవసరానికి అందుబాటుగా అమృతాంజన్ ఉంచుకోండి.

అమృతాంజన్ 10 రకాల
ఔషధాలు చేరిన మందు




అమృతాంజన్ క్రొత్తగా అట్ట పెట్టెలో వస్తుంది. సీసా 'అలూ' క్యాప్‌తో సీలు చేయబడింది.

అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ

JWT/AM-2329A

